అబద్ధాలతో కాలం గడుపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

- మాజీ జడ్పీటీసీ సైదిరెడ్డి

మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 31: సీఎం రేవంత్‌రెడ్డి హామీలను అమలు చేయకుండా అబద్ధాలతో కాలం గడుపుతున్నారని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి విమర్శించారు. సోమవారం మండల పరిధిలోని కరక్కాయలగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూర్‌నగర్ వేదికగా నిర్వహించిన సన్నబియ్యం పంపిణీ పథకం ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి అనేక అసత్యాలు మాట్లాడారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం, సీతారామ, దేవాదుల వంటి ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడంతో రాష్ట్రంలోని రైతాంగం 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసత్య ప్రచారాలు మాని పరిపాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సన్నబియ్యం పంపిణీ అమలు విషయంలో ప్రజలకు అనేక సందేహాలు ఉన్నాయని అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ కీత జయమ్మధనమూర్తి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేపల్లి వీరబాబు, నాయకుడు చింతకుంట్ల శ్రీను, గ్రామశాఖ అధ్యక్షుడు కీత కృష్ణమోహన్, నాయకుడు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

తాడువాయి సొసైటీలో అవినీతిపై విచారణ జరిపించాలి

- సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు

సమావేశంలో మాట్లాడుతున్న బుర్రి శ్రీరాములు

మునగాల, మార్చి 31: మండలంలోని తాడువాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై జిల్లా అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి ఎంత అవినీతి జరిగిందో బయట పెట్టాలని సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీలో కోటి రూపాయల వరకు అవినీతి జరిగిందనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. రుణాలు తీసుకున్న రైతులు తిరిగి డబ్బులు చెల్లించినప్పుడు రసీదులు ఇచ్చారు కానీ బ్యాంక్ ఖాతాలో జమచేయలేదని ఆరోపించారు. గొర్రెలు, గేదెల లోన్లు తీసుకున్న రైతులు వాటి పేరుతో ఇన్సూరెన్స్ డబ్బులు కడితే ఆ డబ్బులు కూడా మాయచేశారని, పెట్రోల్ బంక్ పేరుతో రూ.25 లక్షలు గోల్‌మాల్ చేశారని పేర్కొన్నారు. వీటిపై విచారణ జరిపించాలని అన్నారు. ఈ సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు గండు వరమ్మ, యంపటి బ్రహ్మం, మారం వెంకటరెడ్డి, నాయకులు చంద్రయ్య, వెంకటాద్రి, స్టాలిన్‌రెడ్డి, సుందరయ్య, స్వరాజ్యం పాల్గొన్నారు.

మేళ్లచెర్వు వాసికి గ్రూప్-1లో 384వ ర్యాంక్

రాజశేఖర్‌రెడ్డి

మేళ్లచెర్వు, మార్చి 31: గ్రూప్-1 ఫలితాల్లో మేళ్లచెర్వుకు చెందిన వట్టే రాజశేఖర్‌రెడ్డి 460 మార్కులతో రాష్ట్రస్థాయిలో 384 ర్యాంక్ సాధించారు. మేళ్లచెర్వులోని నవభారతి పాఠశాలలో పదో తరగతి చదివిన రాజశేఖర్‌రెడ్డి అనంతరం బాసర ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన రాజశేఖర్‌రెడ్డిని తల్లి కష్టపడి చదివించారు. గతంలో గ్రూప్-4లో ఉద్యోగం సాధించి కోదాడ మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆయన ఇటీవల విడుదలైన గ్రూప్-2,3 ఫలితాల్లో కూడా మంచి ర్యాంకులు సాధించారు. పేదరికాన్ని జయించి పట్టుదలతో నాలుగు ఉద్యోగాలు సాధించిన రాజశేఖర్‌రెడ్డిని బంధుమిత్రులు అభినందించారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

బహుమతులను ప్రదానం చేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్‌నాయుడు

ఆత్మకూర్.ఎస్, మార్చి 31: ఉగాది పండుగ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన ఎస్ఐ శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలు విజయవంతంగా ముగిశాయి. విజేతలకు ఆదివారం రాత్రి ఎస్ఐ శ్రీనివాస్‌నాయుడు, నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. కబడ్డీ పోటీల నిర్వహణకు సహకరించిన శ్రీనివాస్‌నాయుడును గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తంగెళ్ల వీరారెడ్డి, కాకి కృపాకర్‌రెడ్డి, పందిరి రాంరెడ్డి, కసగాని బ్రహ్మంగౌడ్, గునగంటి మల్సూర్, భిక్షం, ఆవుల సింహాద్రి పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త

గుర్రంపోడు, మార్చి 31: కట్టుకున్నవాడే కాలయముడై భార్యను దారుణంగా హత్య చేసిన సంఘటన మండలంలోని తెరాటిగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దుప్పెల్లి అరుణ(40)ను ఆమె భర్త కిరణ్ ఇంట్లోనే మధ్యాహ్న సమయంలో కత్తితో మెడ కోసి హత్య చేసి పరారయ్యాడు. తీవ్ర రక్త స్రావంతో ఇంటి బయట పడిపోగా చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భార్య, భర్తల మధ్య గొడవ హత్యకు కారణంగా భావిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన దుప్పల్లి కిరణ్‌తో 12 సంవత్సరాల క్రితం తెరాటిగూడెం గ్రామానికి చెందిన కన్నెబోయిన అరుణతో ప్రేమ వివాహం జరిగింది. వీరికి నాలుగు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రంలో సాఫీగా జరిగిన సంసారం ఆ తర్వాత వీరు తెరాటిగూడేనికి మకాం మార్చారు. అప్పటి నుంచి తరుచుగా భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గొడవలకు గల కారణాలు తెలియరాలేదు. సంఘటన స్థలాన్ని ఇన్‌చార్జి సీఐ డి.రాజు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ దవఖానాకు తరలించారు. కన్నెబోయిన శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
WANTED
★ Wanted Sales Executives @ Miryalaguda, Unic Chem Technologies to make Best Future in Water Treatment Plants & Chemicals. Ph: 9573244611, raju@unicchem.com
NT-330933
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
6% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | తొలుపులి: 9182777638

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు
- శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, మార్చి 31: రంజాన్ పండుగను జిల్లావ్యాప్తంగా ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈద్గాలు, మసీదుల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్దకు వెళ్లి ముస్లింకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు షేక్ మస్తాన్ వలీ, ఎస్‌కే.రఫీతో పాటు పలువురి నివాసాలకు వెళ్లి వారి అతిథ్యాన్ని స్వీకరించారు. అంతకు ముందు బీఆర్ఎస్ జిల్లా మహిళా నాయకురాలు సల్మా మస్తాన్ క్యాంపు కార్యాలయంలో జగదీశ్‌రెడ్డికి ఖీర్ తినిపించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ యావత్ సమాజం సంతోషంతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, శాంతిసామరస్యాలు ఫరిడవిల్లాలనే సంకల్పంతో నెల రోజులు చేసిన దీక్షలకు అల్లా మోక్షం కలిగిస్తారనే విశ్వాసం ఉందన్నారు. సర్వమత ఆచారాలను గౌరవించడంలో తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకత ఉందని, అది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లనే ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ సలీం, ఎస్‌కే. జలీల్‌పాషా, రియాజుద్దీన్, సయ్యద్, షకీల్, నాయకులు ఉప్పల ఆనంద్, మొరిశెట్టి శ్రీనివాస్, ఎస్‌కే.రఫీ, మస్తాన్ వలీ, బత్తుల రమేశ్, ఆకుల లవకుశ, బత్తుల జాని, అనిల్‌రెడ్డి, బింగి రేణుక, నిమ్మనగోటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా ప్రార్థనలు

నేరేడుచర్ల/కోదాడ/తిరుమలగిరి: జిల్లా వ్యాప్తంగా మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువులు ఖురాన్ చదివి వినిపించారు. పలువురు రాజకీయ పార్టీల నాయకులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నేరేడుచర్ల, మేళ్లచెర్వు, మఠంపల్లి, హుజూర్‌నగర్, పాలకవీడు, గరిడేపల్లి, కోదాడ, చిలుకూరు, మునగాల, చివ్వెంల, ఆత్మకూర్.ఎస్, పెన్‌పహాడ్, తిరుమలగిరి, నాగారం, తుంగతుర్తి, అర్వపల్లి, నూతనకల్ మండలాల్లో వేడుకలను నిర్వహించారు.

నేరేడుచర్ల ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కోదాడ ఈద్గా వద్ద ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

సబ్సిడీపై గడ్డి విత్తనాలు

చిలుకూరు, మార్చి 31: మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో గడ్డి విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని మండల పశు వైద్యాధికారి వీరారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 కిలోల సంచి ధర రూ.123.50 ఉందని, పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పాలకవీడు: జాన్‌పహాడ్‌లో బీటీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో ఇరిగేషన్ ఏఈ వీరబాబు తదితరులు

గరిడేపల్లి, మార్చి 31: మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో సీసీ రోడ్డు పనులను రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి కృష్ణ, సుబ్బయ్య, చింతకాయల సైదులు, ముత్తినేని సురేశ్, అంజయ్య, సోమయ్య, షేక్ సైదా, హుస్సేన్, కీత పెద్ద మట్టయ్య, జుట్టుకొండ అంజయ్య, కీత వెంకటేశ్వర్లు, ఆవుల సైదులు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ తదితరులు

జాన్‌పహాడ్‌లో బీటీ రోడ్డు పనులు

పాలకవీడు: మండలంలోని జాన్‌పహాడ్ గ్రామం నుంచి జాన్‌పహాడ్ లిఫ్ట్ పంప్‌హౌస్ వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు ఇరిగేషన్ ఏఈ వీరబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని హైస్కూల్ నుంచి జాన్‌పహాడ్ లిఫ్ట్ పంప్‌హౌస్ వరకు 4.1 కిలోమీటర మేర రూ.3 కోట్లు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకాశ్, సుబ్బారావు, నాగయ్య, జ్యోతి, శ్రీనివాస రావు పాల్గొన్నారు.

వృద్ధురాలికి నిత్యావసర సరుకులు వితరణ

సరుకులు అందజేస్తున్న శారదా సేవా నిధి సొసైటీ సభ్యులు

తుంగతుర్తి, మార్చి 31: మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధురాలు మిట్టగడుపు రాములమ్మకు శారదా సేవా నిధి సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి రెడ్డబోయిన నాగరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాలె కమలాకర్, మెడ్డల సుధాకర్, బింగి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హైవే 65పై టోల్ చార్జీలు తగ్గింపు

- నేటి అర్ధరాత్రి నుంచి అమలు

పంతంగి వద్ద ఎన్‌హెచ్ఏఐ టోల్ ప్లాజా

చౌటుప్పల్ రూరల్, మార్చి 31 : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి నుంచి టోల్ చార్జీలు తగ్గనున్నాయి. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది జులై ఒకటి నుంచి టోల్ రుసుమును ఎన్‌హెచ్ఏఐ ఏజెన్సీల ద్వారా వసూలు చేస్తున్నది. గతంలో ప్రైవేటు ఏజెన్సీలు ఉన్న సమయంలో ప్రతి సంవత్సరం టోల్ ఫీజులు పెంచుకునే నిబంధనలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ సంస్థ నిర్వహణలో ఉండటంతో 2025 ఏప్రిల్ 1నుంచి ఎన్‌హెచ్ఏఐ టోల్ రుసుములను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. 181.5 కిలోమీటర్ల హైవేను రూ.1,740 కోట్లతో నిర్మించిన జీఎంఆర్ సంస్థ 2012 డిసెంబర్ నుంచి 2024 జూన్ 31వరకు టోల్ వసూళ్లను నిర్వహించింది. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి 65పై చౌటుప్పల్ మండలం పంతంగి వద్ద, కేతెపల్లి మండలం కొర్లపహాడ్, ఆంధ్రప్రదేశ్‌లోని చిల్లకల్లు వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి.

పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఒక వైపు ప్రయాణానికి కారు, జీపులకు 15 రూపాయలు, ఇరు వైపులకు రూ.30, చిన్నతరహా వాణిజ్య వాహనాలకు ఒక వైపు ప్రయాణానికి రూ.25, రెండు వైపులకు కలిపి రూ.40, ట్రక్కులకు ఒకవైపు రూ.50, ఇరువైపులకు 75రూపాయలు, చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద అన్ని రకాల వాహనాలకు ఒకవైపు ప్రయాణానికి 5రూపాయలు, ఇరువైపులా ప్రయాణానికి 10 రూపాయలు తగ్గించారు. 24గంటల్లో తిరుగు ప్రయాణానికి వాహనాలకు 25శాతం మినహాయింపు ఇచ్చారు. ఈ రుసుములు సోమవారం అర్ధరాత్రి నుంచి అమలవుతున్నాయి.

మద్యం మత్తులో ఎలుకల మందు తాగి వ్యక్తి మృతి

హుజూర్‌నగర్, మార్చి 31: మద్యం మత్తులో ఎలుకల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం హుజూర్‌నగర్‌కు చెందిన అలకుంట భిక్షం (39) కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 29న మద్యం మత్తులో ఎలుకల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తొలుత హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. భిక్షం కుమార్తె స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య వెల్లడించారు.

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

ఆత్మకూర్.ఎస్, మార్చి 31: మండల పరిధిలోని నంద్యాలవారిగూడెం గ్రామానికి చెందిన విసవరపు రామిరెడ్డి (50) అనారోగ్యంతో ఆదివారం మరణించగా.. ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో నాయకుడు తూడి నర్సింహారావు, సింగిల్ విండో చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ముద్దం కృష్ణారెడ్డి, నంద్యాల కృష్ణారెడ్డి, యూత్ అధ్యక్షుడు తంగెళ్ల మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నూతనకల్, మార్చి 31: మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొణతం కృష్ణారెడ్డి విద్యుత్ షాక్‌కు గురై గాయాల పాలు కాగా సోమవారం బీఆర్ఎస్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బిక్కి బుచ్చయ్య పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల విద్యాసాగర్, బాణాల సత్యనారాయణరెడ్డి, బత్తుల విజయ్‌కుమార్, బత్తుల గురువయ్య, పులుసు లింగమల్లయ్య, తొట్ల శ్రీను, బత్తుల వెంకన్న, గాంధీ పాల్గొన్నారు.

నేరేడుచర్లలో డయాబెటిక్ వైద్య శిబిరం

శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నేరేడుచర్ల, మార్చి 31: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేరేడుచర్ల ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉచిత డయాబెటిక్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 130 మందికి షుగర్ పరీక్షతో పాటు బీపీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ నిరంతరం సామాజిక సేవలో ముందుంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశంతోనే డయాబెటిక్ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బట్టు మధు, చల్లా ప్రభాకర్‌రెడ్డి, గుండ్రా సైదిరెడ్డి, కందిబండ శ్రీను, పూర్ణచంద్రారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, కోటేశ్వరరావు, చిలకరాజు శ్రీను, కోటేశ్వరరావు, వెంకన్న, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు

- మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్

గరిడేపల్లి, మార్చి 31: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో చెనగాని వెంకటనర్సయ్య జ్ఞాపకార్థం వీఎన్ఆర్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని హుజూర్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఎన్ఆర్ ట్రస్ట్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ చెనగాని పురుషోత్తం, పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, చింతకాయల సైదులు, మండవ నాగేశ్వరరావు, వేణు, గుండు రమణ పాల్గొన్నారు.

పోలీస్ సేవలపై ఫీడ్‌బ్యాక్

- స్టేషన్లలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు
- సిబ్బంది పనితీరు తెలుసుకునేందుకు పోలీస్ శాఖ చర్యలు

నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్

నేరేడుచర్ల, మార్చి 31: పోలీస్ స్టేషన్లలో సిబ్బంది పనితీరు తెలుసుకునేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు అందించిన సేవలకు ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని నిర్ణయించారు. దీని కోసం ఆయా ఠాణాల్లో ఐదు అంశాలలో ప్రజల అభిప్రాయం తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఏర్పాటు చేశారు. ఈ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదుదారులు, ప్రజలు పోలీసుల పనితీరుపై తమ అభిప్రాయాలు తెలపొచ్చు. ఇంతకు ముందు డీజీపీ కార్యాలయం నుంచి ఫిర్యాదుదారులకు ఫోన్ చేసి వివరాలను అడిగేవారు. కేసు పరిస్థితి ఏమిటి, పరిష్కారం అయిందా లేదా, పోలీసు సిబ్బంది ఎలా ఉన్నారు అనే అంశాలపై ఆరాదీసేవారు. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తేవడంతో ప్రజలే నేరుగా అభిప్రాయాలను తెలుపొచ్చు.

స్కాన్ చేసే విధానం

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేశాక పేరు, పోలీస్ స్టేషన్ పరిధి, మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్, బాధితుడి సమస్య, సిబ్బంది పనితీరు తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. తర్వాత మెసేజ్ లేదా ఫోన్ చేయాలా అనే ఆప్షన్ ఉంటుంది. వివరాలను పూర్తి చేసిన తర్వాత అప్‌లోడ్ చేస్తే సీపీ, డీజీపీ కార్యాలయాలకు వివరాలు వెళ్తాయి. దీంతో పోలీసుల పనితీరు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారుడితో ప్రవర్తించిన విధానం ఉన్నతాధికారులకు తెలుస్తుంది.

ఐదు అంశాలపై..

ఈ అభిప్రాయ సేకరణలో ఐదు అంశాలు ఉన్నాయి. ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, ఈ–చలాన్, ట్రాఫిక్ ఉల్లంఘనలు, పాస్‌పోర్టు ధ్రువీకరణ అంశాల్లో ఫీడ్ బ్యాక్ అందించొచ్చు. క్యూఆర్ కోడ్ ద్వారా వివరాలు ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతారు. దీంతో పోలీసులలో మార్పు రావడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. కాగా పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు కోసం వచ్చే వారితో దురుసుగా ప్రవర్తించే వారికి భయం పట్టుకుంటుంది. అంతే కాకుండా స్టేషన్‌లో చేతివాటం ప్రదర్శించే వారు ఇబ్బందులు పడే అవకాశం లేకపోలేదు. ఆన్‌లైన్ అభిప్రాయం ద్వారా పోలీస్ స్టేషన్లకు గ్రేడింగ్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

ప్రతి స్టేషన్‌లో ఏర్పాటు

ప్రతి పోలీస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంచారు. ఫిర్యాదుదారులు స్టేషన్‌కు వెళ్లినప్పుడు ఏదైనా సమస్య ఉంటే నేరుగా క్యూఆర్ కోడ్‌లో లాగిన్ అయ్యి వారి సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించవచ్చు.

ఆటో డ్రైవర్లకు అందని సాయం

- నెరవేరని ప్రభుత్వ హామీ
- అవస్థలు పడుతున్న డ్రైవర్లు

తిరుమలగిరి ఆటో స్టాండ్‌లో గిరాకీ లేక నిలిచిన ఆటోలు

తిరుమలగిరి, మార్చి 31: ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరలేదు. ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీ అటకెక్కింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలకు గిరాకీ లేక.. ప్రభుత్వం పట్టించుకోక ఆటో డ్రైవర్ల జీవితం అస్తవ్యస్తంగా మారింది. ఆటోలు నడవక అనేక మంది కుటుంబాలు గడవడం కష్టంగా మారింది. ఆటోల ఈఎంఐలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల చదువులకు ఫీజులు, పుస్తకాలు, డ్రెస్సుల ఖర్చులు ఎలా వెళ్లదీయాలని ఆవేదన చెందుతున్నారు. రోజుకు కనీసం రెండు వందలు కూడా రావడం లేదని పలువురు డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 600 కుటుంబాలు ఆటో వృత్తిలోనే జీవనం సాగిస్తున్నారు. గతంలో రోజుకు రూ.800 నుంచి రూ.1000 వరకు సంపాదించేవారు. కానీ ప్రస్తుతం రూ.200 కూడా రాని దుస్థితి నెలకొంది. జీవనోపాధి కరువై దిక్కుతోచని స్థితిలో ఆటో కార్మికులు కాలం వెల్లదీస్తున్నారు. అయినా ప్ర